# బతుకు బండారం

## కథానిక

"చూడు, దూరాన ఆ రెండు కొండలూ గున్న ఏనుగుల్లా ఢీ కొనబోయి, పరస్పర విరోధం దేనికని, సంధి చేసుకున్నట్లు-గుద్దుకొనబోయి, గ భా లు న ఆగిపోయి ఏర్పరచిన లోయ, ఆ రెంటి మధ్య-మబ్బుల్లో మసక మసకగా అస్తమించే సూర్యబింబం... ఆ రెండు కొండలు ఎంత చిన్నగా, నున్నగా, తిన్నగా..."

"దూరపు కొండలు అలానే ఉంటాయి." అన్నాడు రంగా. కాని, సత్యం మునిగి తేలుతున్న కవిత్వపు వరవడిలోంచి, బయటపడి వినిపించుకోలేక తన ధోరణిలో తనే ఉన్నాడు.

"ఆహా! ఎంత నిర్మలమయింది ఆకాశం. ఏమి ఆ నీలిరంగు. సొంపుసొంపుగా వంపులు తిరిగి, వలపులు రేకెత్తించే, ఆ వినిర్మలమైన నీలిమబ్బులు, ఆకాశానికెంత అందం చేకూరుస్తున్నాయి. వాటిపైపడే ఆ అస్తమిత అరుణకాంతి ఎంత అందాన్నిస్తోంది. ఎంత నిర్మలమయింది ఆకాశం. ఎంత చక్కగా, ముచ్చటగా, ముద్దుగా, గట్టులు లేని, నున్నని..."

"ఆపు." ఆగలేక అరచాడు రంగా.

"ఒకసారి దృష్టి క్రిందికి దించు. నువ్వుండే భూమిని పరిశీలించు. అన్నీ కొండలు, రాళ్లు—కొండరాళ్ళ దగ్గరనుంచి గులకరాళ్ళవరకు అన్నీ రాళ్ళే-గుహలు, అరణ్యాలు, క్రూరమృగాలు-మిట్టపల్లాలు, అడుగడుగునా కంటికి కనుపించని కఠోర కంటకాలు."

అంటూ, కోటు పైన తొడిగి బయట పడబోతున్నాడు. సత్యానికి కర్థంకాలేదు. తీవ్రంగా ఓ కోరచూపు చూచాడు రంగాని. అంతే. మళ్లీ తన ధోరణిలో కొట్టుకుపోయాడు.

చొక్కా చిరుగులు బయట పడకుండా, చొక్కా లాగులోపల వేశాడు. కాని వెన్ను దగ్గర? అందుకని తాతలనాటి గుమాస్తాకోటుతో దాన్ని కప్పాడు రంగా.

జేబులో వెతికాడు - ఒక్కటే బీడీ ఉంది. తీసి కాల్చబోయాడు. అగ్గిపెట్టెలో కూడా ఒకే పుల్ల ఉంది. అది కూడా ఆరిపోయింది. రెండు వేళ్ళమధ్యా పుల్లను అటూఇటూ తిప్పి, మెల్లిగా జార విడచాడు. అగ్గిపెట్టె విసిరి కొట్టాడు. కిళ్లీకొట్టు దగ్గరకు వెళ్ళి, కాల్చి ఉంచిన కొబ్బరి తాటికి ముట్టించి, బయలు దేరాడు.

అదే ఆఖరు బీడీ. కాణీ జేబులోలేదు. విసుగెత్తే, చిరాకెత్తే హృదయాలకు ప్రశాంతాన్ని చేకూర్చేందుకు కనీసం ఓ బీడీ అయినా ఉండాలి. కొనేందుకు కాణీ లేదు. ఉన్ననిల్వ అయిపోయింది. ముందు?

"రెండు పెసరట్... రెండు మినపట్..."

ఎదురు హోటల్. అక్కడి కెట్లావచ్చాడో అతనికే తెలీదు. సర్వరు కేకలు వింటూంటే నోట్లో నీళ్లు తిరుగుతున్నాయి. మధ్యాహ్నం నుంచి కాఫీ లేదు. దానికితోడు కొంచెం చలిగా ఉంది. కడుపులో కాలుతోంది. అడుగువెయ్యలేనా అనిపిస్తోంది. టిఫెన్లా ఉన్నా, కనీసం ఓ కాఫీ అయినా త్రాగితే ఎంతైనా బాగుంటుంది. అవును బాగుంటుంది, కాని ఎలా?

వెర్రెత్తినట్లుగా అయిపోయింది రంగాకు. కాస్త ప్రశాంతతన్నా లేకపోతే నిజంగా పిచ్చెక్కిపోతుంది. లాభం లేదు.

బీడీ ఆరిపోయింది. అరె! అప్పుడేకాల్చాడు. సరిగ్గా రెండు ఘాటైన దమ్ములన్నా కొట్టలేదు. వెధవ బీడీ అప్పుడే ఆరిపోయింది. అగ్గిపెట్టె అప్పుడే అయిపోయింది. మరోసారి వెనక్కి వెళ్ళి కొబ్బరి తాటితో ముట్టిస్తే? ఛ! తను సూటు బూటులోఉన్నాడు. కనీసం న్యాయంగా చార్మినార్ సిగరెట్టయినా కాల్చాలి. అధమపక్షంగా బీడీ కాలుస్తున్నాడు. అదైనా ఇప్పుడు సెకండు హేండు. అక్కట అంత మందిలో మళ్ళీకాలిస్తే అసహ్యంగా ఉండదూ? బీడీ పారెయ్యలేదు.

యాముజాల శంకరం

పారేస్తే మరోహాటిలేదు. కొనేందుకు "ధనాలు" లేవు. అకస్మాత్తుగా బీడీ జారి క్రింద పడింది. వంగి ఏరలేదు. విచారంగా, నిరాశగా, ఓచూపు దానికేసి చూచాడు. ఏ జేబు లో పడేసినా, రూముకు పోయిన తరువాత శాన్నా కాల్చుకునేందుకు ఉపయోగ పడేది. ఆగలేక బూటుతో నేలకు రాసేశాడు. అతని హృదయాన్ని రాస్తున్నట్లు బాధ పడ్డాడు.

తలెత్తాడు. హోటల్. "పదార్థములన్నియు నేతితో తయారు చేయబడును" -బోర్డు. నేతి కంపు రంగా ముక్కుల్లో ఘుమాయిస్తోంది. నోరూరుతోంది. అవతల తినేవాళ్ళను చూస్తూ ఉంటే కడుపు తరుక్కుపోతోంది. వాడిని తప్పించి, ఆ పెసరట్టు, ఆ కాఫీ...

బయలు దేరాడు. నడుస్తున్నాడు. తను నడుస్తున్నాడా? ఏమో! మొత్తానికి శరీరం ముందుకు పోతోంది. జనం రొద ఎక్కువయ్యేసరికి గుంపు గుంపులుగా రోడ్డుకడ్డంగా ఉండేసరికి యింక ముందుకు పోలేక పోయాడు. ఏమిటూ అని చూస్తే సినిమా హాలు. "అవారా." అన్నిరంగాల్లోనూ, అన్ని విధాలా ముందడుగు వేసిందని, ప్రజా-ప్రభుత్వము-పత్రికలు ఘోషించే అత్యద్భుత చిత్రం.

రంగాలో చలనం కలిగింది. నాటకాలన్నా సినిమాలన్నా చెవికోసుకుంటాడు. అన్నమైనా మానేసి, ఆ నాటికి ఆ చిత్రం చూడాలనుకునే రకం. చిన్నతనం నుంచీ నాటకాల పిచ్చి మహా ఎక్కువ. హైస్కూల్లోనూ, కాలేజీల్లోనూ అనేక నాటకాల్లో నటించాడు. ఏ పాత్ర ఎలా రంగం మీదికి రావాలో, ఎలా వెళ్ళిపోవాలో, ప్రవేశ నిష్క్రమణల దగ్గరనుంచి, బహు జాగ్రత్తగా నటించేవాడు. నటింప చేసేవాడు. అందుకనే అతన్ని అందరూ "అద్భుత కళామూర్తి!" అనేవారు. ఎన్ని యోగ్యతా పత్రాలు సంపాదించాడో నిజంగా! అవన్నీ కుప్పతెప్పలుగా అక్కడా అక్కడా పారేశాడు.

చిత్రం చూడాలి. అవారా చూడాలనివచ్చిన నాటినుంచీ అనుకుంటున్నాడు. అందులో పృథ్వీరాజంటే పడిచస్తాడు. కారణమడిగితే ఇలా అనేవాడు: "మన తెలుగు చిత్రాల్లో క్లోజప్పులెన్ని ఉంటాయి? చిత్రం మొత్తంమీద, అన్ని పాత్రలకు కలిపి, ఓ యాభై ఉంటాయేమో! ఇంత బారు 18000 అడుగుల చిత్రాల్లోనూ. అవి చూడాలంటేనే మహా కష్టంగా,బాధగాఉంటుంది. మరదే ఏ పృథ్వీరాజో, చంద్రమోహనో, షొరాబ్ మోడీ, లాంటివాళ్లు నటిస్తే, ప్రవేశం మొదలుకొని, నిష్క్రమణందాకా అన్ని పాట్లు క్లోజప్పుల్లోనే ఉంటాయి. వాళ్ళదగ్గర ఆ నటనా చాతుర్యం, ఆ సామర్థ్యం ఉంది. మాటిమాటికి ముఖభావాలు మార్చి మన్నలను పొందగలరు."

ఇలాంటివి లక్ష చెప్పేవాడు.

ఒకో టిక్కెట్టు ఇచ్చే కిటికీ దగ్గర బారుగా క్యూలో జనం ఉన్నారు. ఒకసారి ఇలా అనుకున్నాడు. "నాలాంటివాడు, ఓ డ్రామా, ఎంత మంచిది వేసినా, పావలా టిక్కెట్టుకూడా కొనరుగదా!"

వెంటనే ఆలోచన మారింది.

"ఇప్పుడు చిత్రానికి, ఈ జనంవల్ల, నాలుగు వేలన్నారావు? ఇంత డబ్బు, ఇంత అవస్థపడి, చొక్కా సహితం చించుకొని, జేబులు కొట్టించుకొని, దీనికి ఎందుకువెడుతున్నారు. ఏ రాయలసీమకో అంటే కానీ యివ్వటానికి చస్తారేం?"

అవారా బొమ్మలు చూస్తూంటే, పృధీరాజు ముఖం మాంచి పోజులో ఉంది. గురివెందగింజ సామెత. అందర్నీ తిట్టాడు. కాని, తనుచూడాలి ఆగలేడు. అణువణువు విజృంభిస్తోంది. ఆగలేడు చూడాలి.

అబ్బ! తలొక్కసారి పైకెత్తి ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడచాడు. గబ గబ బయటపడ్డాడు జనంలోంచి. పట్టి నిగ్రహశూన్యుడు. భగవంతుడ తన్ని అలా ఎందుకు సృష్టించాడో!

చేరాడు "గాంధీపార్కు". తురాయి చెట్టు క్రింద మట్టిలో కూలబడ్డాడు. జనం వస్తున్నారు, పోతున్నారు. ఎలక్ట్రిక్ లైట్లు వాళ్ళ ముఖాల మీదపడి మెరుస్తున్నాయి, వెలుస్తున్నాయి. జంటలు రెండుమూడువెళ్ళాయి. ఇద్దరు మిత్రులు కిలకిల నవ్వుకుంటూ వస్తున్నారు. మడత నలగని సూట్లతో ఉన్నారు. జేబులోంచి కాప్స్టెన్ సిగరెట్లుతీసి వెలిగించారు.

ఒకరన్నారు: "అదెంతండి. ప్రజకేది అత్యవసరమో, ఏది ప్రజకావాలంటోందో, అది

చేస్తాయని కాస్త ఆందోళన చేస్తేచాలు. పార్టీ ప్రచారంలోకి యిట్టే వచ్చేస్తుంది.''

వాళ్ళవి నిండు సంసారాలు. నాలుగు వేళ్ళూ నోట్లోకి పోతాయి. ఇహ వాళ్ళకు కావలసింది ప్రచారం. దేశోద్ధరణ పేరుతో వీరకంకణం కట్టుకొని, ఏలాగో ఓలాగు, ఒక్కసారి జేలుకు వెళ్ళి వస్తేచాలు. అంతే. ఇలా అనుకున్నాడు రంగా.

"నాలాగా కడుపులో కాలేవాళ్ళకు యీ సమస్యలు పడతాయా. మాటమాట్లాడితే విప్లవం మాలోంచి విజృంభించా లంటారు. నాలుగు ఘాటైన పదాలు వాడుతారు. ఒకప్రక్క కడుపులో కాలుతూవుంటే, ఏదిముందు? ఆమాటంటే మీ తిండీ, బట్టా, దీనిమీద ఆధారపడి ఉందంటారు.'' చిన్నగా నవ్వాడు.

చలి చలిగా ఉంది.

రేడియోలో నిలయ విద్వాంసుల వాయిద్య గోష్ఠికి స్వస్థిచెప్పించి అరవాయనతగులుకున్నాడు-అరవటానికి. అతనెట్లా ప్రతి చిన్న విషయానికి బాధపడుతాడో, అలా ఆ ప్రముఖుడు బాధపడుతున్నట్లు సంగీతాన్ని తెగలాగుతున్నాడు.

తురాయిచెట్టుమీద కాకులు "కావు,కావు'' మన్నాయి. బహుశా ఏ గుడ్లగూబ గూటో జొరబడి వేధిస్తోందో?

దూరాన గడ్డిలో "కీచు''మంటూ, ఏదో పురుగో-పిట్టో అరుస్తోంది.

రంగా తల్లో గిర్రున ఆలోచనలిలా బయలుదేరాయి:

తనింత నికృష్ట స్థితికి రావటానికి కారణమెవరు? తండ్రి! తండ్రి! అవును తండ్రే!

లేక లేక కలిగిన ముద్దు బిడ్డనని అల్లారుముద్దుగా పెంచాడు. తన తండ్రికి నాలుగెకరాల పొలం, చిన్న పెంకుటిల్లు, ఓ పల్లెటూళ్లో వుండేవి.తండ్రి చాలా అమాయకుడని చెప్పవచ్చు. కొడుకంటే పంచ ప్రాణం. అతిముద్దుగా, అతిగారాబంగా, పువ్వుల్లో పెట్టి పోషించేవాడు.

పేరు రంగా. అహాఁహాఁ తన జీవితమంతా రంగరించినట్లుగానే ఉంది.సార్థక నామధేయుడు. ఈ బానిస జీవితానికిక విముక్తి లేదా! ఏం ప్రభూ!

చిన్ననాటినుండి, తండ్రి, తనకేది కావాలని మాట వరుసకన్నా తెచ్చిపెట్టేవాడు. ఐదేండ్లు రాగానే అక్షరాభ్యాసం చేయించారు. ఇంటికి పంతుల్ని పిలిపించి చదువు చెప్పించాడు. ఇలా రంగా పెరిగాడు.

హైస్కూల్లో చదివేటప్పుడు తల్లి పోయింది. అయినప్పటికీ తండ్రి ఆ భారంవహించాడు. ముద్దు ముచ్చటలు తీర్చేవాడు. స్కూలుకు నడచి వెళ్ళనంటే. రాలీ సైకిల్ కొనిపెట్టాడు. టైం తెలీటం లేదంటే వాచీ కొనిపెట్టాడు. ఆ రెండు మొన్నటి దాకాకూడా ఉన్నాయి.

మడతలకు మడతలు సూట్లు, రెండు జతల బూట్లు, ఇంకా ఏవో, ఏవో లక్షకొని పెట్టేవాడు. తండ్రి ముతక పంచే కట్టేవాడు. కాని తనకు ఉన్ని, సిల్కు దుస్తులు కొనేవాడు. తండ్రి బట్టలేనాడు యిస్త్రీ చేయించేవాడు కాదు. రంగావి మాత్రం నలగని సూట్లు, అప్పుడంతరిలోకి (బడి పిల్లలు) నీటుగా, గోటుగా ఉండేవాడు. అయితే తండ్రి తనకెలా కొనిపెడుతున్నాడు? ఆ విషయంగురించి అడిగి తెలుసుకునే జ్ఞానం తనకప్పుడు లేదు.

అందరితోపాటు అతనూ కాలేజీలో చేరాడు. నెలకు నూరు, నూటయాభైరూపాయిల దాకా తన ఖర్చులకు తండ్రి పంపేవాడు-కాలేజీ జీతం కట్టి, పుస్తకాలు, కాగితాలు అని, కొనిపెట్టి వెళ్ళిన తరువాత. తనకేం తెలుసు, తను మాత్రం కాలేజీలో ధుమాక్రింద తిరిగేవాడు. చాలవని కబురుచేస్తే మరో ముప్పయ్యో, నలభైయ్యో ఊడిపడేవి.

బి. ఏ. మొదటి సంవత్సరంలో చేరాడు. అప్పుడే తండ్రి తనకు పెండ్లిచేస్తానన్నాడు. కాని ఎం. ఏ. ప్యాసయేంతవరకు రంగా పెండ్లి ససేమిరా వద్దన్నాడు! ఆ పాపపు బుద్ధి భగవంతుడాయనకు ఎందుకు పుట్టించాడో! అంతే. కుమారుని మాట కాదనలేక ఊరుకున్నాడు. కొడుకు పెద్దపెద్ద చదువులు చదివి, నలుగురు బిళ్ళ బంట్రోతులు వెంట వస్తూంటే ధీమాగా గొప్ప ఉద్యోగం చేస్తాడని తండ్రి ఆశించాడు. తల్లిలేనివాడు. తన వంశానికి ఒక్కడు. అందుకని కుమారునికోసం ఏదైనా చేసేవాడు. కాని ఆయన ఆశయాలు అడుగంటాయి. కనీసం, రంగా పెండ్లయినా కండ్లారా చూడలేక పోయాడు. రంగా నాల్గవ సంవత్సరం చదువుకు

రావటం తండ్రి చావటం ఒకేసారి సంభవించాయి.

అంతే. కష్టాలు మొదలు. ఇంటికి రంగా కర్మలకు వెళినప్పుడు బయటపడింది బలిదారం. ఊరు నిండా అప్పులే. తనమన్న గౌరవంఅంతా ఉపయోగించి కొడుకుకోసం అప్పులుచేశాడు.ఏనాటికైనా తీర్చలేడా? ఓస్! ఇవెంత అనుకుని ఉండవచ్చు. కాబూలీలదగ్గర, మార్వాడీలదగ్గర కూడా అప్పులే. రూపాయికి పావలాల చొప్పున తెచ్చాడు.

కర్మలు చేసేందుకు కానీ లేదానాడు. అప్పుల క్రింద పొలం-ఇల్లూ అన్నీ సరిపోయాయి. మిగిలింది రంగా: శ్మశానంలో తండ్రి బూడిదపైపడి ఏడ్చాడు. వటవట కండ్లవెంట నీళ్లు కార్చాడు. అవే కర్మలు. అవే అంత్యక్రియలు-మాసికాలు, అబ్దికాలు అంతే. వాటితోనే తండ్రి తృప్తి పడాలి.

చదువుకు స్వస్తి చెప్పాడు.

ఉద్యోగాన్వేషణ మొదలు. ఉద్యోగం దొరకటం కష్టమయింది. నానా అవస్థలుపడ్డాడు. అడగనివాడు లేదు. ఎక్కని ఆఫీసు లేదు. సైకిలు అమ్మి కొన్నాళ్లు గడిపాడు. చేతి వాచీతో, ఉంగరాలతో కొన్నాళ్లు. ఒకోరోజు అన్నంలేక ఆకలితో ఏడ్చేవాడు.

ఒక రోజు, ఈ రోజులాగానే, ఆ రోజుల్లో ఇలానే పార్కులో, ఇలాగే దిగులుగా కూర్చొన్నాడు. అప్పుడు తండ్రిమీద తగని కోపం వచ్చింది తిట్టాడు.

"ఆ స్కూల్ ఫైనల్‌తోనే చదువు ఆపివేస్తే ఎంత బాగుండేది. ప్రపంచజ్ఞానం తెలుసుకునేందుకు బి. ఏ. లు, యం. ఏ. ల బదులు మహాకవులు రాసిన ఏ పుస్తకాలో చదువుకునేవాడే. అక్షరజ్ఞానం వస్తే చాలదా? ఈనాడిలా వీథుల వెంట తిరగాల్సిన గతిపట్టేది కాదుకదా! ఇంత వరకు చదివినందువల్ల తనకువచ్చిన పెద్ద ఉద్యోగం లేదు. ఆనాడీమాత్రపుది రాకపోయేది కాదు.

కాని, ఈనాడు అన్ని విధాలా త్రొక్కివేయబడ్డాడు. ఈ బస్తీలల్లో, ఈ మాయల్లో, ఈ అసహజ వికృత వాతావరణంలో క్రూర మృగాలకన్నా నీచమైన ఈ నరరూప రాక్షసుల కోరల్లో నలిగి చస్తున్నాడు. జోరున ఏడవాలనుపించింది. ఏడ్చే నష్టంలేదు. దుఃఖాన్ని కంటివెంట రెండు బిందువులుగా కార్చి, ఏడుపు గొంతుక దాటనీయకుండా, నోటివెంట గట్టిగా పీల్చి, దిగమ్రింగి, ఓ దీర్ఘనిశ్వాసం విడిచాడు. పక్షులు, వృక్షాలు ఆలకించి ప్రతిధ్వనిలో ఒక చిరునవ్వు నవ్వాయి.

ఈ గుమాస్తా గిరీ దొరకటం బ్రహ్మాండమైంది. తలప్రాణం తోకకు వచ్చింది. కడకెలాగో రిజిస్ట్రారు ఆఫీసులో గుమాస్తాగా కుదిరాడు.

తనకు వచ్చే డబ్బు సరిపోవడంలేదు. తను చదువుకు నెలకు ఖర్చుచేసినదాంట్లో సగంలేదు. వందలు ఖర్చుచేసిన చెయ్యి, వెధవ డబ్బులు ఎన్నాళ్ళు వస్తాయి. కాని, ముందుగా జాగ్రత్త పడి, గది అద్దె, హోటల్లో భోజన టిక్కెట్లు ముందుగానే కొంటాడు.

కృష్ణాస్రవంతిలా వచ్చే గతస్మృతులల్లోంచి విదిలించుకొని లేచాడు. హోటలుకు తిండికి బయలుదేరాడు.

మళ్ళీ మధ్యమార్గం. ఈ తఫా మళ్ళా మరీ ఎక్కువగా జనం పోగైఉన్నారు. మొదటి ఆట అయి, రెండవ ఆట మొదలుపెట్టబోతున్నారు. ఆడవాళ్ళ గేటుదగ్గరకు వచ్చాడు.

కారు మేఘాల్లోంచి ఒక బ్రహ్మాండమైన కనులు మిరుమిట్లుగొలిపే మెరుపెలా వస్తుందో, అలా రంగా కళ్లకు మైకం కమ్మించే అపురూప అప్సరస, పోతపోసినబొమ్మ, తీర్చిదిద్దిన విగ్రహం ఓ జిప్సీ. అబ్బ! హృదయం చెదరిపోయింది.

ఆకలిగొన్న సింహం బోనులోంచి బయటకు రాలేక, కటకటాల ప్రక్కన పచ్చగడ్డి మేస్తున్న మేకపై, ఊం ఒక్క ఊపులోపడి, గుటుక్కున మ్రింగి, ఆకలి తీర్చుకోవటానికి ఎలా అవస్థ పడుతూ, గర్జిస్తూ ఉంటుందో, అలా హృదయ తృష్ణ తీర్చుకునేందుకు రంగా తదేకంగా ముఖం చూస్తూ ఆగిపోయాడు.

అందరూ వెళ్ళిపోయారు. రిక్షాలు జట్కాలు కూడా అయిపోయాయి, కాని ఆ అమ్మాయి అక్కడే ఉంది. రంగా కర్థంకాలా. ఎవరికోసం నిరీక్షిస్తుందో!

"అమ్మా! టైర్ బరస్టయింది" డ్రైవరువచ్చి చెప్పాడు.

ఆ అమ్మాయి ఉరిమి చూచింది డ్రైవర్ని.

"ఇందాకటి నుంచి ఎందుకు రాలేదు? ఆ విషయం ఎందుకు చెప్పలేదు? ఏంచేస్తున్నారు?" ఒక్కొక్క చూపులో వాడిబాణాలు విడుస్తోంది. కదలికలో వయ్యారం ఉట్టిపడుతోంది. మాటలు తీవ్రంగాఉన్నా, హాయిగాఉన్నాయి. రంగా ఆగలేక పోతున్నాడు. సంభాషణ వింటున్నాడు. భావపరంపరలు హృదయంలో విజృంభిస్తున్నాయి.

డ్రైవర్ ఏదో నసుగుతున్నాడు. "రిక్షా ఏదన్నా చూడు." ఆర్డర్.

డ్రైవర్ మామూలు రిక్షా తెచ్చాడు. "అన్ని రిక్షాలు అయిపోయాయి. సైకిల్ రిక్షా కూడా దొరకలేదు..." ఇహ మాట్లాడలేదు.

ఎక్కిందా నరవాహనం.

"నేనా కారుదగ్గర ఉంటానమ్మా!" ఆగాడు డ్రైవరు.

జీప్సీ వెంట పడ్డాడు రంగా. రిక్షా వెంటపడి ఆవిడను యింటిదాకా సాగనంపాడు.

దిగింది రిక్షా. రిక్షావాడిచేతులో రూపాయి పెట్టింది.

"పెట్టి పుట్టింది" అనుకున్నాడు రంగా.

వీధిలైట్ల కాంతిలో తళుక్కున మెరిసింది తన్వి ముఖం. తనివి తీరా చూచి రెండు లొట్టలేసాడు.

"అబ్బ! జన్మ తరించింది." అనుకున్నాడు.

అలాంటి అప్సరసను తానంత వరకు చూడలేదు.

జీప్సీ తుర్రున ఇంట్లోకి దూరింది.

అలవాటు ప్రకారం బీడీకోసం జేబులు తడుముకున్నాడు రంగా.

# అక్క — చెల్లెలు

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

ఆదివారం. పూర్తి సెలవు. ఇంకేమీ చెయ్యడానికి లేక శ్రీపతిదగ్గరకి బయలుదేరాను-వాళ్ళావిడ వచ్చివుంటే మంచి కాఫీ అయినా పోస్తుందని. గవర్నమెంటుకి కాఫీమీద కోపం వచ్చాక మా అయ్యరు కాఫీలో చింతపొడి కలిపేస్తున్నాడు. ఇంటి కాఫీ కూడా ఒక కాఫీయేనా అని-పైన తాగక తప్పదు.

గుమ్మం దాటేసరికి శ్రీపతి కలం పట్టుకుని కాగితం ముందు పెట్టుకుని ఆలోచిస్తున్నాడు. కథ రాసే ప్రయత్నం, అనుకున్నాను.

"రారా భాయ్...సిటీబస్సుల్లే బుర్ర అంతా ఆలోచనలతో క్రిక్కిరిసిపోయింది. బస్‌స్టాప్ వస్తేకాని అందులో పేసింజర్లు దిగరు-ఇన్స్పిరేషన్ వస్తేగాని మన బుర్రలోంచి కథ ఊడిపడదు. బస్‌స్టాప్ ఎలా అయినా వస్తుందిగాని మనకి ఇన్స్పిరేషన్ రావటంలేదు" అన్నాడు గుక్కతిప్పకుండా.

"నే వచ్చాగా...అయినా అన్ని కథలు తిరిగొచ్చినవి వుండగా అడ్రస్ మార్చక కొత్త కథలెందుకురా?" అన్నాను-ఈమధ్య నా కథలూ వాడి కథలూ మహాజోరుగా తిరిగొస్తున్నాయి.

"కథ రాయడంలేదురా?" అన్నాడు వాడు.

"గేయమా?"

"అదీ కాదురా. శ్రీమతికి ఉత్తరం రాస్తున్నాను."

నవ్వాను-"దానికింత ఆలోచన ఎందుకురా? అయితే ఆవిడ దిగలేదన్నమాట. ఇవాళ మంచి కాఫీ తాగుదామనుకున్నాను. అయినా, ఆంధ్ర రాష్ట్రమల్లే వస్తాను వస్తాననడమేగాని, రావడం కనిపించదు. మిస్‌ఫార్చ్యూన్ భాయ్" అన్నాను.

"నీకేం? నువ్వేమన్నా చెప్తావు-నా బాధ నీకేం తెలుసు? ఛస్తూంటే."

"ఒరేయ్-ఆవిడ దిగిదంటే నీకింక మళ్ళా కరచరణాలు బంద్...నా మాట విని, ఈ స్వేచ్ఛని సెలిబ్రేట్ చెయ్యి. అంటే లోపలికివెళ్ళి మంచి కాఫీ చేసి పట్రా. ఈ లోపల నిన్న తిరిగొచ్చిన కథ ఏదన్నా ఇయ్యి. చూస్తూంటాను" అన్నాను.

వాడి పెళ్ళాం మళ్ళా సెలవు ఎక్స్టెండ్ చేసింది. ఆవిడ కేంపు వేశాక మావాడు పదకొండు కథలూ, నాలుగు గేయాలూ-మొత్తం నూట డెబ్భయి పేజీలు రాశాడు. పన్నెండు పేజీల కథ ఒకటి అచ్చయింది. మిగిలినవి